'కాసాని' గెలుపుతోనే..

బీసీల ఐక్యతను దెబ్బ తీసేందుకు ఆధిపత్య వర్గాల కుట్ర

చేవెళ్ల ఎన్నికల్లో ఆలోచన చేయాలంటున్న బీసీ సంఘాలు

బీసీల రాజ్యాధికారానికి పునాది

చేవెళ్ల లోక్‌సభ ఎన్నికతోనే బీసీ కులాలు రాజ్యాధికారానికి పునాది వేసుకోవాలని బీసీ సంఘాలు కోరుతున్నాయి. ఆధిపత్య వర్గాలు బీసీ వర్గాలు ఏకం కాకుండా ప్రయత్నం చేస్తున్నాయని నేతలు మండిపడుతున్నారు. బీసీ కులాలను అణచివేతకు గురిచేస్తున్న రాజకీయ పార్టీలకు ఓటు వేసే విషయంలో బీసీలంతా ఆలోచన చేయాలని వారు పేర్కొంటున్నారు. బీసీలకు బీఆర్‌ఎస్ తప్ప ఇతర పార్టీలేవీ ప్రాధాన్యత ఇవ్వడంలేదని బీసీ నేతలు వాపోతున్నారు. చేవెళ్ల లోక్‌సభలో బీసీలకు బీఆర్‌ఎస్ మంచి అవకాశం కల్పించిందని చెబుతున్నారు. బీసీల సమస్యలపై మాట్లాడే గళం పార్లమెంటులో ఉండాలని, బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుతోనే అది సాధ్యమని వారు స్పష్టం చేస్తున్నారు. చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు బీసీలంతా క్రియాశీలకంగా పనిచేయాలని పిలుపునిస్తున్నారు. *- రంగారెడ్డి, మే 9 (నమస్తే తెలంగాణ)*

బీసీలంతా ఏకతాటిపైకి రావాలి

పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలంతా ఏకతాటిపైకి రావాలి. ఎన్నో ఏండ్ల తర్వాత చేవెళ్ల గడ్డపై ఒక బీసీ నేతకు ఎంపీ అభ్యర్థిగా అవకాశం వచ్చింది. బీసీలంతా ఒక్కసారి ఆలోచించి, పార్టీలకతీతంగా కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. కాసాని గెలుపొందితే లోక్‌సభలో తెలంగాణ గొంతుక వినిపించడంతో పాటు బీసీల సమస్యలపై పార్లమెంట్‌లో పోరాటం చేస్తారు.

- చందిప్ప జంగయ్య, మల్లారెడ్డిగూడ(షాబాద్)

కాసాని గెలుపు ఖాయం

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపొందడం ఖాయం. గతంలో బీఆర్‌ఎస్ తరపున గెలిచిన ఇద్దరు ఎంపీలు సొంత ప్రయోజనాల కోసం కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో చేరి మళ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో ప్రజలందరూ బీఆర్‌ఎస్ వైపే ఉన్నారు. పదేండ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలిచింది.

- బండ అజయ్‌కుమార్, రుద్రారం(షాబాద్)

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బీసీలను అణచివేయాలన్న లక్ష్యంతో బీసీ నాయకత్వాన్ని ఎదగనీయకుండా కుట్రలు పన్నుతున్న కాంగ్రెస్, బీజేపీలకు ఈ ఎన్నికల్లో బీసీల ఐక్యత, ఓటు రుచి దెబ్బ చూపిస్తాం. బీఆర్‌ఎస్ బలపరచిన బీసీల ముద్దుబిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు వెన్నంటి ఉంటాం. లేకపోతే వచ్చే ఐదేండ్లు అగ్ర కులహంకారానికి పని చేయాల్సి వస్తుంది. చేవెళ్ల గడ్డపై బీసీల ఐక్యత చాటుతాం.

- శరణ్ భూపాల్, యాలాల మండల ప్రచార కమిటీ కార్యదర్శి

సమయం ఆసన్నమైంది

బీసీలు ఏకం కావాల్సిన సమయం వచ్చింది. బీసీలు ఏకమై అగ్ర వర్గాల రాజకీయ నాయకులను గతంలో గెలిపించుకుంటే వారి వల్ల బీసీలకు ఎలాంటి లాభం జరుగలేదు. కాసాని జ్ఞానేశ్వర్ గతంలో బీసీ కులాలను ఒక్క చోటుకి తెచ్చి ఐక్యవేదికను ఏర్పరిచారు. బీసీలను అవమానపర్చేలా మాట్లాడుతున్న ఇతర రాజకీయ పార్టీల దురహంకార మాటలకు త్వరలోనే సమాధానం చెప్తాం.

- గోవిందు, ఎన్కేపల్లి, యాలాల మండలం

బడుగు బలహీన వర్గాల నేతను గెలిపించుకుందాం

బడుగు బలహీన వర్గాల నేత చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు బీసీ బిడ్డలందరూ ఏకమవ్వాలి. బీసీల్లో ఐక్యత లేదని ఉన్నత వర్గాల నాయకులు హేళన చేసి మాట్లాడుతున్న విషయాన్ని బీసీలు గమనించి మన ఓటుతో సత్తా ఏంటో చూపించాలి. మన నేతను గెలిపించి పార్లమెంట్‌కు పంపితే బీసీల గొంతుకను వినిపిస్తారు.

- వడ్డె వెంకట్‌రాములు, మోత్కూర్, దోమ మండలం

బీసీలను గేలిచేస్తున్న వారికి ఓటుతో బుద్ధి చెప్పాలి

ఉన్నత వర్గాలకు చెందిన నాయకులు బీసీలను గేలిచేస్తూ.. మీ బీసీలకు దమ్ముంటే మీ నాయకుడు జ్ఞానేశ్వర్‌ను చేవెళ్ల గడ్డపై గెలిపించుకోండని సవాల్ విసురుతున్నారు. అదే సవాల్‌ను చాలెంజ్‌గా తీసుకొని బీసీ వర్గాలంతా ఏకమై కాసానిని భారీ మెజార్టీతో గెలిపించి వారి సరైన బుద్ధి చెప్పాలి. బలహీనతను వదిలి ఓటు అనే బలాన్ని ఉపయోగించుకొని మన నాయకుడిని గెలిపించాలి.

- మంగలి సత్యయ్య, మోత్కూర్, దోమ మండలం

కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం

బీసీలను గుర్తించి ఎంపీగా చేవెళ్ల నుంచి పోటీ చేయడానికి జ్ఞానేశ్వర్‌కు కేసీఆర్ అవకాశమిచ్చారు. బీసీలందరూ ఏకమై కాసానిని గెలిపించి ఆయనకు కానుకగా ఇద్దాం. బీసీల చైతన్యాన్ని చాటాలి. పార్లమెంట్‌లో బీసీల గళాన్ని వినిపించడానికి అవకాశం వచ్చింది. కదం తొక్కి.. ప్రజలను తప్పుదోవపట్టించే నాయకులకు బుద్ధి చెప్పాలి. *- పోలెమోని అశోక్ ముదిరాజ్, దాసర్లపల్లి, కందుకూరు*

జెండాలను పక్కన పెడుదాం

పార్టీలకతీతంగా జెండాలను పక్కన పెట్టి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించాలి. అందుకోసం బీసీలందరూ కలిసి రావాలి. నిస్వార్థంగా వెనుకబడిన తరగతుల అభివృద్ధికి జ్ఞానేశ్వర్ పోరాడుతుండు. కొన్నేండ్లుగా అగ్రకులాల వారు బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకుండ్రు. బీసీల పక్షాన మాట్లాడడానికి కాసానికి అవకాశం ఇవ్వాలి. *- ఆనేగౌని దామోదర్‌గౌడ్, పులిమామిడి, కందుకూరు*

కాసానే నయం

కాంగ్రెస్, బీజేపీల కంటే చేవెళ్ల ఎంపీగా బీఆర్‌ఎస్ బలపర్చిన కాసాని జ్ఞానేశ్వర్‌రే నయం. ఆయన కొంత ప్రజలతో సంబంధం ఉన్న బీసీ నాయకుడు. ఆయన గెలిస్తే పార్లమెంట్‌లో మన ప్రాంత సమస్యలపై చర్చించగల అవకాశముంటుంది. కాంగ్రెస్, బీజేపీ అయితే చర్చించే అవకాశం తక్కువ. బీసీ అభ్యర్థిని గెలిపించుకుంటేనే బీసీలకు న్యాయం జరుగుతుంది.

- నారాయణ, ఆటో డ్రైవర్, సులేమాన్ నగర్, రాజేంద్రనగర్

ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలి

దమ్ముంటే చేవెళ్లలో బీసీ నాయకుడిని గెలిపించుకోండి చూద్దాం అంటూ ఓ నాయకుడు సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలను అందరూ గుర్తు పెట్టుకుని ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలి. బీసీలంతా ఒకసారి ఆలోచించి చేవెళ్ల గడ్డపై కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటే ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారు.

- వెంకటేశ్, మేస్త్రీ, శాస్త్రీపురం, రాజేంద్రనగర్

చేవెళ్ల గులాబీ అడ్డా.. కాసాని గెలుపు పక్కా..

చేవెళ్ల గులాబీ అడ్డా.. కాసాని గెలుపు పక్కా.. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను కోరుకుంటున్నారు. బీసీలకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బీఆర్‌ఎస్ పాలనలోనే అన్ని వర్గాలకు సమన్యాయం దక్కిందని, పార్లమెంట్‌లో బీసీల బలం పెరిగేలా బీఆర్‌ఎస్‌కు మెజార్టీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.

- పల్లపు మధుకర్, శేరిలింగంపల్లి

బీసీలకు న్యాయం జరగాలంటే బీఆర్‌ఎస్ రావాలి

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తక్కువ కాలంలోనే ప్రజల నమ్మకాన్ని కోల్పోయింది. బీసీలతో పాటు అన్ని వర్గాలకు న్యాయం చేకూరాలంటే బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా బీఆర్‌ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. చేవెళ్ల బీసీ అభ్యర్థి కాసానికి పూర్తి మద్దతునిచ్చేందుకు శేరిలింగంపల్లి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

- లక్ష్మీనారాయణ ముదిరాజ్, చందానగర్

కాసాని గెలుపును ఎవరూ ఆపలేరు

కాసాని జ్ఞానేశ్వర్ గెలుపును ఎవరూ ఆపలేరు. చేవెళ్లలో కాసానిని గెలిపించి బీసీల ఐక్యత, సత్తాను చాటుతాం. బీసీలకు బీఆర్‌ఎస్ పార్టీ మాత్రమే పెద్దపీట వేసింది. ఇలాంటి అవకాశం మళ్లీ రాదు, కాంగ్రెస్, బీజేపీల జిమ్మిక్కులను ఎవరూ నమ్మరు. బీసీలను కించపరుస్తూ మాట్లాడిన అగ్రవర్గ నాయకుడికి తగిన బుద్ధి చెప్పాలంటే జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి.

- భీంసేన్‌చారి, గట్టేపల్లి, ధారూరు మండలం

తగిన గుణపాఠం చెప్పాలి

దమ్ముంటే చేవెళ్లలో బీసీ నాయకుడిని గెలిపించుకోండి చూద్దాం అంటూ ఓ నాయకుడు సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలను అందరూ గుర్తు పెట్టుకుని ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలి. ఏ పార్టీలో ఇవ్వని విధంగా బీఆర్‌ఎస్ పార్టీలో ఆరుగురు బీసీ నేతలకు ఎంపీ అభ్యర్థులుగా అవకాశం కల్పించారు. బీసీలంతా ఒకసారి ఆలోచించి కాసానిని గెలిపించాలి.

- రుమ్మ వెంకటేశం, నాగసముందర్, ధారూరు మండలం

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే సర్వమతాల సంక్షేమం

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఐటీ శాఖామంత్రి కేటీఆర్, హాజరైన మైనార్టీలు, నేతలు

- ప్రాణం పోయినా సరే.. తాము సెక్యులరిజాన్ని వదిలిపెట్టం
- బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

బాలానగర్, మే 9: ప్రాణం పోయినా సరే.. తాము సెక్యులరిజాన్ని వదిలిపెట్టేది లేదని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఐటీ శాఖా మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. గురువారం కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధి ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ మల్లికార్జునకాలనీలో స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ నివాస సముదాయంలో ఏర్పాటు చేసిన మైనార్టీల సమావేశానికి ఆయనతో పాటు మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అప్పటి సీఎం కేసీఆర్ సారథ్యంలో సర్వమతాలకు సమాన ప్రాతిపదికన సంక్షేమ పథకాలను అందించినట్లు గుర్తు చేశారు. మైనార్టీల పండుగ రంజాన్‌కు కానుకలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందజేసింది.. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలకు కానుకలు అందజేసిందా? ఒకసారి ఆలోచించుకోవాలని సూచించారు. మైనార్టీల పిల్లల ఉన్నత చదువుల కోసం ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో పని చేసిన ప్రభుత్వాలు మైనార్టీలకు ఏఏ పథకాలు ప్రవేశపెట్టాయో ఆలోచన చేయాలని సూచించారు. పేద మైనార్టీ యువతుల వివాహాలకు ఆర్థిక సాయం అందించడం కోసం షాదీముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీలకు చేసిందేమిలేదని తెలిపారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును 70వేలకు పైగా ఓట్ల మెజార్టీతో గెలిపించారు.. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని మైనార్టీలను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజల నెత్తిన భారం మోపిందన్నారు.

బీజేపీ ఒత్తిడులకు లొంగేది లేదు

సమావేశంలో ముందుగా పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే బీఆర్‌ఎస్ పార్టీ బీజేపీతో దోస్తీ చేస్తుందా? అని ఓ మైనార్టీ వ్యక్తి కేటీఆర్‌ను ప్రశ్నించారు. దీంతో కేటీఆర్ మాట్లాడుతూ.. మైనార్టీల అనుమానాలకు నివృత్తి చేశారు. బీజేపీ ప్రభుత్వంతో బీఆర్‌ఎస్ లొంగేదిలేదు.. లొంగేది ఉంటే మా సోదరి కవిత జైలుకు వెళ్లేదికాదని స్పష్టం చేశారు. బీజేపీతో అంతర్గత సక్యత ఉంటే మా సోదరి కవితకు జైలు జీవితం వచ్చేది కాదని పేర్కొన్నారు. బీజేపీ ఒత్తిడులకు లొంగనందుకే జైలుకు పంపుతున్నారు. మా వైఖరి ఎప్పుడు సెక్యులర్ భావాజాలమే అని స్పష్టం చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి ఓటుకు నోటు కేసులో కేంద్రానికి లొంగి బీజేపీలో చేరనున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లే అని వివరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని ఆదరించి గెలిపించండి అని ఆయన విజ్ఞప్తి చేశారు.

రాయదుర్గంలో మాజీ కార్పొరేటర్ సాయిబాబాతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను బీఆర్‌ఎస్‌కు ఓటెయ్యాలని అభ్యర్థిస్తున్న కాసాని జ్ఞానేశ్వర్ సతీమణి చంద్రకళ

హామీలే గ్యారంటీ.. అమలు జాడలేదు

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
- కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరికలు
- ప్రజల పక్షాన నిలబడే నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్
- రాయదుర్గంలో కాసాని సతీమణి చంద్రకళ ఇంటింటి ప్రచారం

పాస్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్/శేరిలింగంపల్లి, మే 9: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను మోసం చేసేందుకు అడ్డగోలు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాటి అమలును వదిలేసిందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆ పార్టీ హామీలే గ్యారంటీ తప్ప ప్రజలకు అందించడంలో విఫలమైందని, ఫలితంలో ఎన్నికల్లో ప్రజలు తగు గుణపాఠం చెబుతారన్నారు. కొండాపూర్ డివిజన్ అంజయ్య నగర్‌కు చెందిన సీనియర్ నాయకుడు జుబేర్ ఇటీవల కాంగ్రెస్‌లో చేరి.. కొద్ది రోజుల్లోనే తిరిగి తన అనుచర గణంతో బీఆర్‌ఎస్ నేత రమేశ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులను లాక్కోవడం ద్వారా కాంగ్రెస్ పైశాచిక ఆనందం పొందుతుందని, త్వరలోనే ఆ పార్టీకి పైశాచికమే మిగులుతుందని, ప్రజల నుంచి వ్యతిరేకత తథ్యమన్నారు. కష్టసష్టాల్లో బీఆర్‌ఎస్ పార్టీకి అండగా ఉండి భుజాలపై గులాబీ జెండా మోసేవారే నిజమైన కార్యకర్తలని, అలాంటి వారికి పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసానిని అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జుబేర్, అంజద్, అజీ, ఇర్ఫాన్, శభజ్, ప్రవీణ్, ఉదయ్, షమీర్, గౌస్, ఇంతియాజ్, నజీర్, శ్రీనివాస్, రియాజ్, బషీర్, అక్బర్, రహీం, సాయి, శివ ప్రవీణ్ పాల్గొన్నారు.

– మియాపూర్ డివిజన్‌లోని ఓ హోటల్‌లో నియోజకవర్గ స్థాయి పాస్టర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాస్‌రావు బాలింగ్ గౌతం గౌడ్ సహా పాస్టర్లతో కలిసి ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రిస్మస్ పండుగకు కానుకలను అందించిన తొలి సీఎం కేసీఆర్ అందించారని, వారి సంక్షేమం కోసం విశేష కృషి చేశారన్నారు. అన్ని మతాలకు సమాన ప్రాతినిధ్యం ఇచ్చిన పార్టీ బీఆర్‌ఎస్ అన్నారు. చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కాసానిని అధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంటుకు పంపాలని ఎమ్మెల్యే గాంధీ కోరారు. బడుగు బలహీన వర్గానికి చెందిన కాసానికి తమ అధినేత కేసీఆర్ టికెట్టు ఇచ్చారని ప్రజలంతా అండగా నిలిచి అఖండ విజయాన్నందించాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్ల సంఘం ప్రతినిధులు, పాస్టర్లు పాల్గొన్నారు.

రాయదుర్గంలో కాసాని సతీమణి ప్రచారం

ప్రజా సమస్యల పరిష్కారంలో కాసాని జ్ఞానేశ్వర్ ఎల్లప్పుడు ముందుంటారని ఉంటారని, ఎవరూ అధైర్యపడొద్దని, కొండంత అండగా ప్రజల పక్షాన నిలబడుతారని కాసాని చంద్రకళ అన్నారు. గురువారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గం గ్రామంలో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆమె ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. చేవెళ్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేందుకు బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ఆమె అన్నారు. ప్రజల మనిషిగా, ప్రజల కష్టాల్లో అండగా నిలబడే వ్యక్తి, ప్రజలకు ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ అండగా నిలబడుతారని పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలబడే నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను బలపరుస్తూ కారు గుర్తుకు ఓటు వేసి మనందరి బంధువును గెలిపించుకోవాలని కోరారు. గచ్చిబౌలి డివిజన్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు నీరుడి గణేశ్ ముదిరాజ్, చెన్నంరాజు ముదిరాజ్, దారుగుపల్లి నరేశ్, సతీశ్ ముదిరాజ్, అంజమ్మ,బాలమణిలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యమకారుడు కొండకల్ శంకర్‌గౌడ్ జయంతిసందర్భంగా ఆయన ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాసాని చంద్రకళ, మాజీ కార్పొరేటర్ సాయిబాబా

– మియాపూర్ : చేవెళ్ల పార్లమెంటు బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసానికి మద్దతుగా ఆల్విన్ కాలనీ డివిజన్ బీఆర్‌ఎస్ గౌరవాధ్యక్షుడు జిల్లా గణేశ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు గురువారం పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తొలి సీఎం కేసీఆర్ నేతృత్వంలో విశేష అభివృద్ధికి నోచుకున్నదని, మరింత పురోగతి కోసం కాసానిని గెలిపించాలని గణేశ్ కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలతో ఎమ్మెల్యే గాంధీ

నేడు నాగేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

కుత్బుల్లాపూర్, మే 9 : కుత్బుల్లాపూర్ సర్కిల్ ఎంఎన్‌రెడ్డినగర్‌లోని శ్రీ చిత్తారమ్మ పోచమ్మ ఆలయంలో శుక్రవారం నాగేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ మిట్టపల్లి యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30గంటలకు నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నీటి ఎద్దడి సమస్యకు చర్యలు

బాలానగర్, మే 9: కూకట్‌పల్లి మండల పరిధిలో నేషనల్ హైవే మెట్రో స్టేషన్‌పై నీటి ఎద్దడి సమస్య తలెత్తడంతో సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. గతేడాది ప్రయాణికులకు కలిగిన అసౌకర్యాన్ని మోన్స్ అదనపు క్యాచ్ పిట్‌లను తెరిచి పైపులను శుభ్రం చేయించారు. 10ఏండ్ల కిందట మెట్రో రైలు పనుల నిర్మాణ సమయంలో ప్రస్తుతం ఉన్న స్మార్ట్ వాటర్ డ్రెయిన్ సిస్టమ్ దెబ్బతిన్నది. ఫిర్యాదుల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు.

సమ్మర్ ఉత్సవ్‌మేళా

కుత్బుల్లాపూర్, మే 9: ఈ వేసవిలో నగరవాసులను అలరించేందుకు సమ్మర్ ఉత్సవ్‌మేళా పేరుతో కుత్బుల్లాపూర్ మున్సిపల్ మైదానంలో విభిన్న రకాలతో సందర్శకులను ఆకట్టుకునేలా ఏర్పాటు చేశారు. అవతార్ సినిమాలో వివిధ పాత్రల్లో కనిపించే ఏలియన్స్‌ను మేళాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ ఏలియన్స్ పిల్లల్ని, పెద్దల్ని విశేషంగా ఆకట్టుకునేలా 15 రకాల వివిధ రైడ్స్, ఎమ్యూజ్మెంట్ రైట్స్, షాపింగ్‌మాల్స్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. సందర్శకుల కోసం ఈ శుక్ర, శనివారం రెండురోజుల పాటు ఉచితంగా ప్రవేశం ఉంటుందని మేళా నిర్వాహకుడు కె.ఎం డేవిడ్ తెలిపారు.

రాగిడిని భారీ మెజార్టీతో గెలిపించండి

రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రావు

బతుకమ్మలతో స్వాగతం పలికేందుకు వచ్చిన మహిళలు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

అల్లాపూర్/బాలానగర్/జగద్గిరిగుట్ట/దుండిగల్, మే 9: మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రజలను కోరారు. గురువారం అల్లాపూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రావు స్థానిక కార్పొరేటర్ సబీహాబేగంతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. రోడ్‌షోలో అడుగడుగునా మహిళలు పెద్దఎత్తున బతుకమ్మలు, మంగళహారతులు, పూల మాలలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేండ్లుగా తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. స్థానికుడు రాగిడి లక్ష్మారెడ్డి గెలిపించుకునేందుకు ఇంటింటికీ తిరిగి ప్రచారాన్ని ముమ్మరం చేయాలని సూచించారు. జాతీయ పార్టీలైన, కాంగ్రెస్ బీజేపీలు స్థానికులను కాకుండా ఎక్కడి నుంచో అభ్యర్థులను తీసుకొచ్చి ఇక్కడ పోటీకి పెట్టారని, వారు ఎప్పుడూ అందుబాటులో ఉండరన్నారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా అల్లాపూర్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

– మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహా బేగం ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం డివిజన్ పరిధి సఫ్దర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థికి రాగిడి లక్ష్మారెడ్డి కి మద్దుతుగా కార్పొరేటర్ బీఆర్‌ఎస్ కార్యకర్తల తో కలిసి ఇంటింటి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

బాలానగర్‌లో...

బాలానగర్:మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో పర్యటించి స్వర్ణధామనగర్‌లోని గోధాసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హెచ్‌ఏఎల్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలిసి ఆయన సందర్శించి అక్కడ వ్యాయామం చేస్తున్న పలువురిని కలిశారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించడం ద్వారా అభివృద్ధికి ఓటు వేసినట్లు అవుతుందన్నారు. కేపీహెచ్‌బీ కాలనీలో డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు డివిజన్ పరిధిలోని 9వ ఫేజ్‌లో ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలను కలిసి కరపత్రాలు అందజేసి కారు గుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఓల్డ్‌బోయిన్‌పల్లి హెచ్‌ఏఎల్ పార్క్ ఓపెన్‌జిమ్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

జగద్గిరిగుట్టలో...

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కేసీఆర్ రోడ్‌షోతో రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమైందని బీఆర్‌ఎస్ నేతలు విశ్వాసం వ్యక్తం చేశారు. ఇంటింటి ప్రచారం చేశారు. జగద్గిరిగుట్ట డివిజన్ సోమయ్యనగర్‌లో గురువారం డివిజన్ నేతలు కరపత్రాలు పంచి ఓట్లడిగారు.ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీశంభీపూర్‌రాజుకు తోడుగా రాగిడిని గెలిపించుకుంటే పనులు జరుగుతాయని సూచించారు.

దుండిగల్‌లో...

దుండిగల్:మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్(ఎన్‌ఎంసీ) పరిధిలోని 8వ డివిజన్‌లోని బాలాజీ టవర్స్‌లో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్‌ఎంసీ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయప్రసాద్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు మేకల మధుసూదన్, కుమార్ రెడ్డి, శివ, ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

మైనర్లతో పనులు.. ఇద్దరు యజమానులపై కేసు

దుండిగల్,మే 9: నిబంధనలకు విరుద్ధంగా మైనర్లతో పనులు చేయించుకుంటున్న ఇద్దరు యజమానులపై సూరారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బాలరక్షక భవన్,మేడ్చల్ జిల్లా యూనిట్ మేనేజర్ అరుణ్ ఝుంజల్, బాలానగర్ జోన్ స్మైల్‌టీం సభ్యులతో కలిసి గురువారం సూరారం కాలనీలోని పలు బేకరీలు, దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో సాయిబాబానగర్‌లోని అల్మాస్ బేకరీలో కర్ణాటకకు చెందిన 15ఏండ్ల బాలుడు పనిచేస్తున్నట్లు గుర్తించారు. అదే విధంగా.. పాండు బస్తీలోని లేజర్‌షేవింగ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఒడిశాకు చెందిన 16ఏండ్ల వయసున్న మరో ఇద్దరు బాలకార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తించారు. అనంతరం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. బాలకార్మికుల చేత పనిచేయిస్తున్న బేకరీ యాజమాని బి.భగవత్, లేజర్ షేవింగ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ యజమాని, గురుమూర్తినగర్‌కు డి.రవీందర్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అధికారులు చేరదీసిన ఆ బాల కార్మికులను తల్లిదండ్రులకు అప్పగించారు. తల్లిదండ్రులకు ఐసీడీఎస్ అధికారులతో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కూకట్‌పల్లి డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు షురూ

బాలానగర్, మే 9 :కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను దోస్త్ ద్వారా అడ్మిషన్లు మొదలయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.అలివేలు మంగమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీతోపాటు బీబీఏ, రిటైల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నట్లు ఆమె తెలిపారు. విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అడ్మిషన్లు పొందాలని సూచించారు. మరిన్ని వివరాలకు దోస్త్ కోఆర్డినేటర్ డా. మామిడాల రమేశ్‌బాబు, టెక్నికల్ కోఆర్డినేటర్ నాగార్జునను సంప్రదించవచ్చని సూచించారు.